క్లుప్తంగా

నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించాలి

మరికల్: వానాకాలం సీజన్‌లో పత్తి పంటలు సాగుచేసే రైతులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ శాఖ అధికారులు నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు లక్ష్మయ్య, రాములు అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ వానాకాలం సీజన్ మరో నెలరోజులు ఉండగానే కొందరు వ్యాపారులు రైతులకు నకిలీ విత్తనాలను అమ్మేందుకు ప్రయాతిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేని అలాంటి విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని రైతులకు అధికారులు సూచనలు, సలహాలు ఇవ్వాలని తెలిపారు.

గోదాంలు నిర్మించాలి

మరికల్: వరి పండించిన రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మండలంలోని ఎలిగండ్ల వద్ద ఎంపిక చేసిన స్థలంలో ధాన్యం నిల్వల కోసం గోదాములు నిర్మించాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి వేణు ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. ధాన్యం నిల్వ చేసేందుకు గోదాములు లేక ప్రతిసారి అకాల వర్షాలకు ధాన్యం తడుస్తుందన్నారు. ఈ విషయంపై సివిల్ సప్లయ్ అధికారులు స్పందించి గోదాంలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

సున్నపురాళ్ల కుంట గండిని పూడ్చాలి



మరికల్: మండలంలోని కిష్టంపల్లి శివారులో ఉన్న సున్నపురాళ్ల కుంటకు పడ్డ గండిని పూడ్చి మరమ్మతులు చేయాలని ఆయాకట్టు రైతులు కోరుతున్నారు. గండిని పూడ్చి మరమ్మతులు చేయాలని ఇరిగేషన్ అధికారులను కొరుతున్న ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రతి ఏడాది కురిసిన వర్షానికి వృథాగా పోతుందని, ఎమ్మెల్యే స్పందించి మరమ్మతులు చేయించాలని ఆయాకట్టు రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ కళాశాలలోనే ఉత్తమ బోధన

నారాయణపేట రూరల్: ఇంటర్ పూర్తిచేసుకున్న విద్యార్థులు డిగ్రీ ప్రవేశానికి దోస్త్ ప్రక్రియ ప్రారంభమైందని సీఎస్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రంగారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో విద్యాబోధన జరుగుతుందని, నెట్, స్లెట్, పీహెచ్‌డీ వంటి అర్హతలు కలిగిన అధ్యాపకులు బోధన చేస్తారని తెలిపారు. ఎన్‌సీసీతో పాటు ఎన్ఎస్ఎస్ సౌకర్యం ఉందని, విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. దోస్త్ ప్రక్రియలో చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరేందుకు ఆప్షన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

దాహంతో అల్లాడుతున్న మూగజీవాలు



మరికల్: ఎండలు రికార్డు స్థాయిలో దంచికొట్టడంతో మూగజీవాలు దాహంతో అల్లాడుతున్నాయి. మండల కేంద్రంలో ఆదివారం ఓ వానరం దాహం వేసి అరుపులు, కేకలు వేయడంతో పక్కనే ఉన్న యువకులు స్పందించి ఓ బకెట్‌లో నీళ్లు పెట్టాడంతో దాహం తీర్చుకుంది. అడవుల్లో సైతం మూగజీవాలకు నీళ్ల లేక దాహంతో కొన్ని మృత్యువాత పడుతున్నాయి. అటవీ శాఖ అధికారులు స్పందించి మూగజీవాలు, పక్షుల దాహార్తిన్ని తీర్చడం కోసం అడవుల్లో అక్కడక్కడ నీటితొట్టి పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

హజ్‌యాత్రికులకు సన్మానం

ఆత్మకూర్: హజ్ యాత్రకు వెళ్తున్న యాత్రికులను ముస్లింలు ఘనంగా సత్కరించారు. ఆదివారం మస్జీదే సయ్యదియాలో హజ్‌యాత్రకు వెళ్తున్న అఫ్జాల్, అజ్హర్‌లను మస్జీద్ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా హఫీజ్ అజ్హర్‌అలీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఖలీల్, అన్వర్, రఫీక్, మస్తాన్, ఫెరోజ్, అహ్మద్, మునీర్, హనీఫ్, నజీర్, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.





ఊట్కూర్‌లో..



నర్వలో..

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి



మద్దూరు పోలింగ్‌స్టేషన్లలో ఎన్నికల సామాగ్రితో వచ్చిన సిబ్బంది

నారాయణపేట రూరల్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా కేటాయించిన పోలింగ్ బూత్‌లకు సిబ్బంది ఆదివారం సాయంత్రానికి చేరుకున్నారు. నారాయణపేట, మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఆయా పట్టణాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ద్వారా సామాగ్రిని తీసుకుని ప్రత్యేక వాహనాల్లో పోలీసు భద్రతతో పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. సోమవారం ఉదయం 7గంటలకే పోలింగ్ ప్రారంభించాల్సి ఉండటంతో అరగంట ముందుగానే మాక్‌పోల్ కొనసాగుతుంది. దీంతో అన్ని రకాల ఏర్పాట్లను రాత్రిపూటనే పూర్తి చేసుకున్నారు. సిబ్బందికి ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్నిచోట్ల సౌకర్యాలు కల్పించారు.

కోస్గి: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాటుచేసినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. గుండుమాల్, కోస్గి మండలాల్లోని 26పంచాయతీలో మొత్తం 52162మంది ఓటర్లకుగాను 59పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లుతెలిపారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వృద్ధులకు, ఓటర్లకు సంబంధిత సదుపాయాలను కల్పించినట్లు తెలిపారు.

మాగనూర్: పార్లమెంట్ ఎన్నికలకు మండలంలోని 25 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారి సతీష్‌కుమార్ తెలిపారు. మండల వ్యాప్తంగా ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలకు సంబంధిత ఏర్పాట్లు పూర్తిచేసినట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల పరిసరాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు.

నర్వ: పోలింగ్‌కు అన్నిఏర్పాట్లు పూర్తిచేసినట్లు తహసీల్దార్ మల్లారెడ్డి తెలిపారు. మండంలోని ఆయా గ్రామాల్లో 31పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఏలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ఎస్ఐ కురుమయ్య బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు.

ఊట్కూరు: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా మండలంలో ఏర్పాట్లు పూర్తయినట్లు ఆదివారం తహసీల్దార్ మమత తెలిపారు. మండలంలో 51 పోలింగ్ కేంద్రాలు, 22186 పురుషులు, 222901 మహిళా ఓటర్లు మొత్తం 45087 ఉన్నారని ఆమె తెలిపారు.పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు తదితర వసతులను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. సోమవారం ఎన్నికల సిబ్బంది సామాగ్రితో ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. 80మంది పోలీసు బందోబస్తువచ్చినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

మద్దూరు: పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్‌కు అన్ని ఏర్పాటుచేసినట్లు మద్దూరు, కొత్తపల్లి తహసీల్దార్లు మహేష్‌గౌడ్, అనిల్‌కుమార్ ఆదివారం తెలిపారు. మండలంలోని 44పోలింగ్ స్టేషన్లకుగాను ఒక్కో స్టేషన్‌కు 4మంది సిబ్బందిని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. మండలంలో 37,985మంది ఓటుహక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. అలాగే కొత్తపల్లి మండలంలో 18పోలింగ్‌స్టేషన్ల పరిధిలో 16,502 ఇందులో 8,436మంది మహిళలు, 8,065 మంది పురుషులు ఓటుహక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. ఏలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా విధులు నిర్వహించనున్నట్లు ఎస్ఐ రాంలాల్ తెలిపారు.

దామరగిద్ద: పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తహసీల్దార్ జయరాములు, ఎంపీడీఓ శ్రీధర్ తెలిపారు. మండలంలో 62వ పోలింగ్‌స్టేషన్ నుంచి 116వ పోలింగ్ స్టేషన్‌వరకు దామరగిద్ద మండలంలో ఉన్న బొమ్మన్‌పాడ్‌కు 95,96వ పోలింగ్‌స్టేషన్‌లు మినహాయించి మండలంలో మొత్తం 53పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు ఏర్పాటు చేశారు. మొత్తం 44480మంది ఓటర్లు ఉండగా వీరిలో 21810 మంది పురుషులు 22670మంది మహిళ ఓటర్లు ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీ హర్ష

మక్తల్: పార్లమెంట్ ఎన్నికలకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్ అన్నారు. అనంతరం సిబ్బంది ప్రయాణం చేసే బస్‌లను అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని 284పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని 52రూట్ల వారీగా పోలీస్ బందోబస్తుతో పంపించారు. సోమవారం ఉదయం తెల్లవారుజామున ఏజెంట్లు, అందుబాటులో ఉన్న అభ్యర్థులతో మాక్ పోలింగ్ నిర్వహించి ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని కలెక్టర్ కోయశ్రీ హర్ష సిబ్బందికి సూచనలు చేశారు. ఉదయం 7నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని, ఓటర్లు సాయంత్రం 6గంటల వరకు ఓటువేసేందుకు ఎన్నికల సంఘం అనుమతించినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఆయా కేంద్రాల్లో ఏర్పాటుచేసి పీఓలు, ఏపీఓలు, ఇతర పోలింగ్ సిబ్బందికి ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, ఇతర సామాగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ గరిమా నరుల, తహసీల్దార్ సువర్ణరాజు తదితరులు, అధికారులు ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



మాగనూర్‌లో..



రెనివట్లలో బస్సులో వచ్చిన ఎన్నికల సిబ్బంది



దామరగిద్దలో..



నారాయణపేటలో..

16 నుంచి ఆరాధన మహోత్సవాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం తెలంగాణ చౌరస్తాలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ఈనెల 16వ తేదీ నుంచి 18 వరకు ఆరాధన గురుపూజ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ వడ్ల శేఖరాచారి, ప్రధాన కార్యదర్శి నారాయణ తెలిపారు. ఆదివారం దేవాలయం ప్రాంగణంలో ఆరాధన మహోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ 16న స్వామివారి సుప్రభాతం నామ సంకీర్తన, ధ్వజారోహణం, పుణ్యాహవాచనం, కలశస్థాపన, గణపతిపూజ, రెండు రోజుల భజన పోటీలు ప్రారంభమవుతాయన్నారు. 17న వీరబ్రహ్మేంద్రస్వామి, వేంకటేశ్వరస్వామి, శివలింగ ఆంజనేయస్వామివార్లకు అభిషేకం, విశేష పూజలు, హోమం, కుంకుమార్చన, భజనల పోటీలు, స్వామివారి రథోత్సవం ఊరేగింపు, 18న గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వాములవారు, వివిధ దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు, ధార్మికోపన్యాసములు, భజనలతోపాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. స్వామివారి మహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నారాయణ, నర్సింహాచారి, సత్తయ్యచారి, రమేష్, భీమాచారి, ఎన్.భాగన్నగౌడ్, లక్ష్మీనారాయణ, సుధాకరాచారి, కృష్ణయ్యగౌడ్, సురేష్, దత్తాత్రేయచారి తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ టీంల ఏర్పాటు

ఆత్మకూర్: ఓటర్లు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని, ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని జిల్లా అడిషనల్ ఎస్పీ రాందాస్ తేజావత్ అన్నారు. ఆదివారం రాత్రి ఆత్మకూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. కేసుల నమోదు, ఇతర వివరాలను ఎస్ఐ నరేందర్‌తో అడిగి తెలుసుకున్నారు. నేడు జరుగనున్న ఎన్నికలకు ప్రజలందరూ సహకరించాలని, పోలింగ్ కేంద్రాల వద్ద 60 మంది సిబ్బందితో భద్రత ఏర్పాటు చేశామని మొబైల్ టీంల ద్వారా మండలంలోని 35 పోలింగ్ బూత్‌ల వద్ద ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేశామన్నారు. రాజకీయ పార్టీలకు చెందిన వారు సమస్యలను సృష్టించేందుకు ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

అద్దె భవనాల్లో అవస్థలు

- అరకొర వసతులతో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలు
- కొన్నిచోట్ల పంచాయతీలు, పాఠశాలల్లో నిర్వహణ
- సొంత భవనాల మంజూరుకు నోచుకోని వైనం



నర్వ మండలంలోని ఓ గ్రామంలో అద్దెభవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

నర్వ: స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చిన్నారులకు, కిశోర బాలికలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించి ఆటపాటల ద్వారా పూర్వ ప్రాథమిక విద్య అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేశారు. అయితే ప్రతిష్టాత్మకమైన ఐసీడీఎస్ ప్రాజెక్టు ద్వారా సేవలందించే కేంద్రాలు మాత్రం సొంత భవనాలు లేక అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి.

మండలంలో ఇది పరిస్థితి

ఉమ్మడి మండలంలో మొత్తం 33 అంగన్‌వాడీ కేంద్రాలుండగా ఇందులో కేంద్రాల పర్యవేక్షణకు సూపర్‌వైజర్లు 32మంది కార్యకర్తలు, 33మంది ఆయాలు పనిచేస్తున్నారు. ఇందులో మొత్తం 7 నెలల నుంచి 3సంవత్సరాల పిల్లలు 1,180, 3 నుంచి 6సంవత్సరాల పిల్లలు 752 మంది, 2 నుంచి 6సంత్సరాల పిల్లలు 1,580 మంది ఆటపాటల ద్వారా విద్యనభ్యసిస్తున్నారు. 486 మంది గర్భిణులు 486మంది బాలింతలు నమోదు కాబడితే వీరికి ఒక్కపూట సంపూర్ణ ఆహారం అందించేందుకు ఆరోగ్యలక్ష్మీ నిత్యం అమలు చేస్తుంటారు. అలాగే 2,056 మంది కిశోర్ బాలికలకు ప్రతి నెలకు పౌష్టికాహారం సరఫరా చేస్తుంటారు. ఈ నేపథ్యంలో నిత్యం సేవలందించే ఈ కేంద్రాలకు సొంత భవనాలు లేక అరకొర వసతులతో కొట్టుమిట్టాడుతున్నాయి.

■ మండలంలో పెద్దకడ్మూర్, కల్వాల్, రాయికోడ్ గ్రామాల్లో సొంత భవనాలు ఉన్నాయి. మిగితా గ్రామాల్లో 16 అద్దె భవనాలు, అద్దె లేని భవనాలు (పాఠశాలలు, మహిళాసమాఖ్య భవనాలు, పంచాయతీ కార్యాలయాలు) 14 కేంద్రాలు నిర్వహించబడుతున్నాయి.

అద్దె భవనాలు.. అరకొర వసతులు

నిత్యం సేవలందించే ఈ కేంద్రాలు పెద్ద గ్రామాల్లో 2లేదా3 సెంటర్లు, చిన్న గ్రామాల్లో ఒక్కో సెంటర్లు ఉంటాయి. కాని ఈ కేంద్రాలకు ప్రభుత్వం సొంత భవనాలు మంజూరు చేయక కొంత, మంజూరైన వాటిలో నిర్మాణాలు పూర్తికాక అసంపూర్తిగా మిగిలినవి కొంత, ఉండడంతో నిర్వాహణకోసం భవనాలను అద్దెకు తీసుకొని అందులో సెంటర్‌లను నడుపుతున్నారు. కొన్ని గ్రామాల్లో అద్దె భవనాలు దొరకక ప్రభుత్వ భవనాల్లో, లేదా పంచాయతీ కార్యాలయాల్లో సెంటర్‌లను నడుపుతున్నారు. దీంతో చిన్నారుల సేవలకు ఇళ్లకు మధ్యన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కార్యకర్తలు వాపోతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..



మండలంలో కేవలం 3 గ్రామాల్లోనే సొంత భవనాలున్నాయి. యాంకి గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్ నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ ఇంకా ప్రారంభించలేదు. అద్దె భవనాలు 17ఉండగా ప్రభుత్వ భవనాలు అద్దె లేనివి 14ఉన్నాయి. వీటిలోనే పిల్లలకు అన్ని కార్యక్రమాలు చేపడుతున్నాం. పాథర్‌చేడ్‌లో మహిళా సమాఖ్య భవనంలో కొంత ఇబ్బంది ఉంది. గ్రామాల్లో సొంత భవనాల ఏర్పాటుకు ప్రతిపాదనలపై అధికారులకు పంపించాం.

– అరుణ, సూపర్‌వైజర్, నర్వ

మూఢనమ్మకాల నిర్మూలన కమిటీ ఎన్నిక



నూతన కమిటీని అభినందిస్తున్న రాష్ట్ర కార్యదర్శి

నారాయణపేట రూరల్ : మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం జిల్లా నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సమావేశానికి ఎన్నికల పరిశీలకులుగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.రాముయాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోతున్న గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికి మూఢ నమ్మకాలు పోలేదని, వాటిని పూర్తిగా నిర్మూలించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం కమిటీ జిల్లా అధ్యక్షుడిగా చిన్నికృష్ణ, ఉపాధ్యక్షుడిగా సందుల రాజు, రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా అశోక్‌చక్రవర్తి, సహాయ కార్యదర్శులుగా తిరుపతి, కనకప్ప, బాలరాజు, భీములను ఎన్నుకున్నారు. అనంతరం వారితో ప్రమాణ స్వీకారం చేయించారు.

జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి



పూజలుచేస్తున్న భక్తులు

నారాయణపేట రూరల్ : పట్టణంలోని భాస్కరదేవ్ నిలయంలో ఆదివారం జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈమేరకు.. స్వామివారి చిత్రపటానికి పూజలు చేశారు. శ్రీ శంకర సేవా సమితి ఆధ్వర్యంలో పల్లకిసేవా, రుద్రాభిషేకం, బిల్వార్చన, మహా మంగళ హారతి, స్వస్తివచనం, శ్రీశారద భజన మండలి ఆధ్వర్యంలో భజనలు చేశారు. అనంతరం ప్రముఖ కవి రామ్మోహన్‌రావు ఆధ్యాత్మిక బోధనలను వివరించారు. సీతారామ్‌దీక్షిత్, కుమ్మన్నశాస్త్రీ, వెంకు, దేవానంద్, మహేష్, శివానంద్‌పురోహిత్, విద్యాధర్, ధరణీధర్, గోపాలచారి, సురేష్, ధీరజ్ పాల్గొన్నారు.

ఘనంగా మదర్స్‌డే వేడుకలు



జిల్లా కేంద్రంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ బీఎస్ పరంజ్యోతి



చిన్నచింతకుంటలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సమితి సభ్యులు

స్టేషన్ మహబూబ్‌నగర్: దేవుడు తన ప్రేమను మనపై తల్లిరూపంలో పంచుతున్నాడని హైదరాబాద్‌కు చెందిన సిస్టర్ బ్యూలా హెబర్ట్ అన్నారు. జిల్లా కేంద్రం హౌసింగ్‌బోర్డులోగల రెమా వర్షిప్ సెంటర్‌లో పాస్టర్ బీఎస్ పరంజ్యోతి ఆధ్వర్యంలో ఆదివారం మదర్స్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిస్టర్ బ్యూలా హెబర్ట్ మాట్లాడుతూ పిల్లలు మంచి మార్గంలో పయనించేలా ప్రతి తల్లి కృషి చేయాలని కోరారు. ఈ లోకంలో కొంతమంది తల్లులు తమ బాధ్యతను మరిచి ప్రవర్తించడంతో వారి కుటుంబాలు, పిల్లలు అధ్వాన స్థితిలోకి వెళ్లిన ఘటనలు చాలా ఉన్నాయని తెలిపారు. తల్లి బాధ్యతాయుతమైన కుటుంబాన్ని చక్కబెట్టడంలో కీలకపాత్ర పోషించి, ఎంతో ఓపిక, సహనంతో రాణించి త్యాగశీలిగా ఉంటుందన్నారు. ప్రేమకు ప్రతిరూపమైన తల్లుల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ప్రపంచవ్యాప్తంగా మదర్స్‌డే వేడుకలు నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. పాస్టర్ పరంజ్యోతి తల్లులకు బహుమతులు అందజేసి ఘనంగా సన్మానం చేశారు. అనంతరం తల్లుల క్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవయ్య, లక్ష్మన్న, శ్యాంసుందర్, బ్లాండీనా, ప్రెయిజీరాణి, ఎస్తేరు తదితరులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: మండల కేంద్రంలో అమ్మసేవా సమితి ఆధ్వర్యంలో మదర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆస్పత్రి స్టాఫ్ నర్స్ అనిత, మహిళలు లలితారెడ్డి, తులసి, జ్యోతి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో వృద్ధులకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు భక్తరాజు, బాలు, శేఖర్, వెంకటేష్ పలువురు పాల్గొన్నారు.

క్రీడాకారుల్లో నైపుణ్యం పెంపుదల



మినీ స్టేడియంలో పరుగులు తీస్తున్న క్రీడాకారులు

- మండలంలో కొనసాగుతున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు
- ఉత్సాహంగా పాల్గొంటున్న క్రీడాకారులు

ఖిల్లాఘనపురం: ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారుల్లో క్రీడా నైపుణ్యం పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్, హాకీ ఉచిత వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు క్రీడాకారులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈ శిబిరాలకు పలు గ్రామాల నుంచి క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని శిక్షణ పొందుతున్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన క్రీడాకారులు ఈ శిబిరాల్లో కోచ్‌ల ద్వారా శిక్షణ తీసుకుంటున్నారు.

అథ్లెటిక్స్, హాకీలో శిక్షణ

గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు గాను మండలంలో జిల్లా యువజన, క్రీడల శాఖల ఆధ్వర్యంలో రెండు గ్రామాల్లో వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశారు. మండలంలోని సోళీపురంలో హాకీ శిబిరాన్ని ఏర్పాటు చేయడంతో పాటుగా పీఈటీ మన్యంను కోచ్‌గా నియమించారు. అదేవిధంగా ఖిల్లాఘనపురంలోని మినీ స్టేడియం గ్రౌండ్‌లో అథ్లెటిక్స్ వేసవి శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసి ఎన్ఐఎస్ అథ్లెటిక్స్ కోచ్ దేవేందర్‌ను ఈ శిబిరానికి కోచ్‌గా నియమించారు. క్రీడాకారులు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం క్రీడాకారులకు హాకీ, రన్నింగ్, లాంగ్ జంప్, షాట్‌పుట్, జావలింగ్‌త్రోలో కోచ్‌ల ద్వారా శిక్షణ ఇప్పిస్తున్నారు.

ఉచితంగా క్రీడా సామగ్రి

ప్రభుత్వం ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులకు అవసరమైన క్రీడా సామగ్రిని జిల్లా యువజన, క్రీడల శాఖ వారు ఉచితంగా అందించినట్లు కోచ్‌లు తెలిపారు. మే 1 నుంచి 31 వరకు నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వడంతో పాటుగా ప్రశంసా పత్రాన్ని అందించడం జరుగుతుందన్నారు. 8 నుంచి 14 సంవత్సరాల క్రీడాకారులు హాకీ శిబిరంలో 30 మంది, అథ్లెటిక్స్ శిబిరంలో 35 మంది మొత్తం 65 మంది క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు.



ఖిల్లాఘనపురం మండలం సోళీపురంలో హాకీ శిక్షణలో క్రీడాకారులు

చాలా ఉపయోగంగా ఉంది



మా గ్రామంలోని పాఠశాల ఆవరణలో వేసవి హాకీ శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడంతో మాకు చాలా ఉపయోగపడుతుంది. ఈ శిక్షణలో కోచ్ మాకు హాకీలో మెలకువలు నేర్పిస్తున్నారు. ఈ శిబిరంలో గతేడాది మాకు అందించిన శిక్షణతో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చారు. మున్ముందు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చడానికి ఎంతో ఉపయోగపడుతుంది.

– రాకేష్, రాష్ట్ర స్థాయి హాకీ క్రీడాకారుడు, సోళీపురం

క్రీడాకారులకు అవకాశం



గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం మంచి పరిణామం. క్రీడాకారులకు ఇది మంచి అవకాశం. సద్వినియోగం చేసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలి.

– దేవేందర్, ఎన్ఐఎస్ అథ్లెటిక్స్ కోచ్